క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

మామడ: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీటీంతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం ఎస్సై నర్సయ్య, ప్రిన్సిపాల్ రవికిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

12న మెగా జాబ్‌మేళా

ఖానాపూర్: పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాలులో ఈనెల 12న బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. 60కి పైగా కంపెనీలతో నిర్వహించే జాబ్‌మేళాను పదో తరగతి, ఆపై చదివిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 95811 70030, 88977 77734నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జెండా గద్దెకు భూమిపూజ

సారంగపూర్: మండలంలోని జామ్, సారంగాపూర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెల నిర్మాణానికి ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సాగర్ భూమిపూజ చేశారు. త్వరలోనే జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కాసారం దీపక్, మండల ఇన్‌చార్జి శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ రాజు, శనిగారపు రవి, బొడ్డు రాజేశ్వర్, సుధాకర్, అన్వేశ్, సన్నీ, తదితరులు ఉన్నారు.

8న సామాజిక తనిఖీ ప్రజావేదిక

నిర్మల్‌రూరల్: మండల ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గజానన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల రికార్డులను తనిఖీ బృందాలు పరిశీలించి తుది నివేదికలు సమర్పిస్తాయన్నారు. ఉదయం 12:30 గంటలకు జిల్లాకేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

సీతారామరాజుకు నివాళి

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం సురేశ్ , గణపతి, పండరి, రాజేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ప్రభుత్వ భూమి సర్వే చేయాలి

ఖానాపూర్: పట్టణంలోని కొమురంభీం చౌరస్తాలో 110 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేసి సమగ్ర వివరాలు అందించాలని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన సమితి నాయకులు తహసీల్దార్ సుజాతను కోరారు. శుక్రవారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో కమిటీ నాయకులు ఆమెను కలిసి విన్నవించారు. ఈ విషయమై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని సాధన సమితి కన్వీనర్ నంది రామయ్య తెలిపారు. సాగి లక్ష్మణ్‌రావు, ఆకుల శ్రీనివాస్, కొండాడి గంగారావు, ప్రణయ్, నారాయణ, రాజు, రవీందర్, రమేశ్ తదితరులున్నారు.

వైకుంఠరథం అందజేత



సన్మానిస్తున్న గ్రామస్తులు

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామానికి చెందిన బొత్త హన్మంత్‌రావు తన తల్లిదండ్రులు బొత్త శంకర్– కావేరమ్మ జ్ఞాపకార్థం గ్రామానికి రూ.2 లక్షల 20వేల విలువైన వైకుంఠరథం, మూడు సిమెంట్ బెంచీలను శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా దాత హన్మంత్ రావును వీడీసీ సభ్యులు శాలువాతో సన్మానించి భగవద్గీత అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డెన్నవాగుకు స్వల్ప ఇన్‌ఫ్లో

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువన కురిసిన వర్షాలకు శుక్రవారం ప్రాజెక్టులోకి 512 క్యూసెక్కుల నీరు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు కాగా.. ప్రస్తుతం 355.7 మీటర్ల నీరు ఉంది.

ఇంటర్ లింక్‌తో నిరంతర విద్యుత్

- ప్రత్యామ్నాయ లైన్లు ఏర్పాటు చేసిన టీజీఎన్పీడీసీఎల్
- వినియోగదారులకు తీరనున్న ఇక్కట్లు

లక్ష్మణచాంద: విద్యుత్ అంతరాయంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా లక్ష్మణచాంద మండలంలో ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇందుకోసం దీంతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

మండలంలో ఇలా..

లక్ష్మణచాంద మండలంలో వడ్యాల్, నర్సాపూర్ (డబ్ల్యూ), పీచర, మల్లాపూర్, పార్‌పెల్లి, రాచాపూర్, లక్ష్మణచాంద, చింతలచాంద గ్రామాల్లో ఎనిమిది విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇందులో చింతల్‌చాంద సబ్‌స్టేషన్ మినహా మిగిలిన ఏడు సబ్‌స్టేషన్లకు 33 కేవీ లైన్ కోసం వేసవిలో ఇంటర్ లింకు వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చింతల్‌చాంద సబ్‌స్టేషన్‌కు సైతం ఇంటర్ లింక్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ఇటీవల సర్వే చేసినట్లు పేర్కొన్నారు.



రాచాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్

ఒక సబ్‌స్టేషన్ నుంచి మరో సబ్‌స్టేషన్‌కు..

ప్రకృతి వైపరీత్యాలు, మరమ్మతులు లేదా మరో కారణంతోనైనా ఒక విద్యుత్ లైన్‌లో లేదా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఇంటర్ లింక్‌లైన్ ద్వారా మరో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేస్తారు. నిర్మల్ అక్కాపూర్ 220 కేవీ ఫీడర్ నుంచి లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్ సబ్‌స్టేషన్‌కు, వడ్యాల్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ లైన్ ఉంది. ఒకవేళ లక్ష్మణచాంద సబ్‌స్టేషన్‌లో ఏదైనా సమస్య తలెత్తితే నర్సాపూర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసుకోవచ్చు. పార్‌పెల్లి సబ్‌స్టేషన్‌లో అంతరాయం కలిగితే మల్లాపూర్ సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ విద్యుత్ సరఫరా చేసుకునే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. చింతల్‌చాంద సబ్‌స్టేషన్ పరిధిలో అంతరాయం ఏర్పడితే లక్ష్మణచాంద నుంచి సింగిల్‌ఫేజ్ విద్యుత్ సరఫరా చేసుకునే వీలుందని అధికారులు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ కోసమే..



వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మండలంలోని ఏడు సబ్‌స్టేషన్లకు ఇంటర్ లింకులైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. త్వరలో చింతల్‌చాందకు కూడా లైన్ ఏర్పాటు చేస్తాం.

– మహేశ్, ఏఈ, లక్ష్మణచాంద

మూడు మార్గాలు..

జిల్లాలోని అక్కాపూర్‌లోని 220 సబ్‌స్టేషన్ నుంచి లక్ష్మణచాందకు 33 కేవీ విద్యుత్ లైన్ ఉంది. దీనిలో ఏదైనా అవరోధం ఏర్పడితే మామడ మండలానికి సరఫరా అయ్యే విద్యుత్‌లైన్ నుంచి లక్ష్మణచాంద మండలానికి సరఫరా చేసుకోవచ్చు. ఇలా కాకుంటే ముటాపూర్ సబ్ స్టేషన్ నుంచి నుండి లక్ష్మణచాందకు విద్యుత్ సరఫరా చేసుకునే వీలుంది. న్యూవెల్మల్–బొప్పారం సబ్‌స్టేషన్ నుంచి రాచాపూర్‌కు ఏర్పాటు చేసే లైన్ పూర్తయితే.. అక్కడ నుండి సరఫరా చేసుకోవ్చని అధికారులు అంటున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



సన్మానగ్రహీతలతో ప్రబంధకారిణి సభ్యులు

భైంసాటౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సరస్వతి విద్యాపీఠం తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి పతకమూరి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరం ఉంటూ, దేశం పట్ల భక్తి పెంచుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రాంత కార్యదర్శి అనఘ వెంకటలక్ష్మి, ప్రాంత శిశువాటిక ప్రముఖ్ కొత్తపల్లి ఉమ, ప్రధానోపాధ్యాయుడు భోజన్న, ప్రబంధకారిణి సభ్యులు కుంట కాశీనాథ్, రవి, తదితరులున్నారు.

సభకు తరలిన కాంగ్రెస్ నేతలు



లక్ష్మణచాంద: సభకు వెళ్తున్న నాయకులు



కడెంలో..



ఖానాపూర్ క్యాంపు కార్యాలయం వద్ద..

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ సభకు మండలంలోని ఆ పార్టీ నాయకులు తరలివెళ్లారు. నిర్మల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని వివిధ గ్రామాల నుంచి హైదరాబాద్ వెళ్లినవారిలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, కపిల్, భుజంగ్‌రావు, షఫీ, రత్నాకర్‌రావు, నర్సింగ్‌రావు, సుధీర్‌రెడ్డి ఉన్నారు.

కడెం: కడెం మండలకేంద్రం నుంచి ప్రత్యేక వాహనాల్లో కాంగ్రెస్ నాయకులు సభకు తరలివెళ్లారు. వెళ్లినవారిలో ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, మండలాధ్యక్షుడు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, రమేశ్, వాజీద్, నారాయణ, కృష్ణ, రాజు తదితరులున్నారు.

సారంగపూర్: మండలంలోని కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ సభకు తరలివెళ్లారు. పార్టీ మండలాధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ హాదీ, నాయకులు తరలివెళ్లారు.

ఖానాపూర్: హైదరాబాద్ సభకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని పలు వాహనాల్లో తరలివెళ్లారు. దయానంద్, చిన్నం సత్యం, మాజీద్, నిమ్మల రమేశ్, తదితరులున్నారు.

రాజకీయ శిఖరం కొణిజేటి రోశయ్య



నివాళులు అర్పిస్తున్న జిల్లా అధికారులు



నివాళులర్పిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌చైన్‌గేట్: గొప్ప వ్యక్తిత్వం.. ఎన్నో పదవులు.. ఉత్తమ విలువలతో.. ఆ పదవులకే వన్నెతెచ్చిన రాజకీయ దురంధరుడు రోశయ్య అని అధికారులు, నాయకులు కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య జయంతి కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోశయ్య నిస్వార్థ సేవాభావంతో పదవుల కోసం కాక, పరిపాలన కోసం జీవించిన మహనీయుడన్నారు. ఆయన పాలన అనుభవం, ఆర్థిక మేధస్సు, చరిత్రలో చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధికారులు నరసింహారెడ్డి, రమణ, సరోజ, విష్ణువర్ధన్, శ్రీకాంత్‌రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో రోశయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్పీ జానకీషర్మిల రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజకీయాల్లో ఉన్నతమైన నైతిక విలువలకు నిలయంగా రోశయ్య నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తవారిని ఓటర్లుగా నమోదు చేయించాలి

కుంటాల: 18 ఏళ్లు నిండి, ఓటరు జాబితాలో పేరు లేనివారిని ఓటరుగా నమోదు చేయించాలని కుంటాల, నర్సాపూర్ (జి) తహసీల్దార్లు కమల్ సింగ్, శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం కుంటాల రైతువేదికలో కుంటాల, నర్సాపూర్(జి) మండలాల బీఎల్‌వోలకు నిర్వహించిన శిక్షణ సమావేశంలో మాట్లాడారు. ఇంటింటా సర్వే నిర్వహించి చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించి.. మార్పులు, చేర్పులు చేయాలని పేర్కొన్నారు. సర్వే సమయంలో కొత్త ఓటరు సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని మాస్టర్ ట్రైనర్ ఎల్లన్న సూచించారు. సమావేశంలో డీటీ నరేశ్‌గౌడ్, ఆర్‌ఐ సుమలత, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కమల్‌సింగ్

టిఫిన్ సెంటర్లకు జరిమానా



జరిమానా రసీదు ఇస్తున్న కమిషనర్ జగదీశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన రెండు టిఫిన్ సెంటర్లకు రూ.15 వేల జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆహార పదార్థాలను నిల్వచేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ దేవిదాస్, ప్రవీణ్ తదితరులున్నారు.

ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ

ఖానాపూర్: మండలంలోని బీర్నందిలో ప్రధాన రోడ్డుపై తమ ఇళ్ల పరిసరాల్లో డ్రెయినేజీ ఏర్పాటు చేసే విషయమై గ్రామానికి చెందిన అఖిలేశ్‌రెడ్డి, చంద్రమౌళిలు ఇటీవల కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మల్ డీఎల్‌పీవో అజీజ్ శుక్రవారం గ్రామంలో పర్యటించి ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ చేపట్టారు. వివాదానికి కారణమైన పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామన్నారు. డ్రెయినేజీ ఏర్పాటుకు ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతి రావాల్సి ఉందన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం బీర్నంది జెడ్పీహెచ్‌ఎస్‌లో పలు మొక్కలు నాటారు. ఎంపీవో రత్నాకర్‌రావు, హెచ్‌ఎం జీఎల్‌వీ ప్రసాద్, కార్యదర్శి దేవేందర్, మూల శ్రీధర్‌గౌడ్, మిట్టపల్లి రవి, మల్లేశ్, రాజన్న, విష్ణు, ఆపరేటర్ సాగర్ ఉన్నారు.

దొడ్డి కొమురయ్య వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్‌లో దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద శుక్రవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య, కురుమ సంఘం నాయకులు జక్కుల భూమన్న, ఆది శ్రీనివాస్, ఔరగొండ రమేశ్, బైరి లక్ష్మయ్య, జక్కుల సాయిరాం, తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

మామడ: మండలంలోని మామడ, పరిమండల్, తాండ్ర, కొరిటికల్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లలో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) సబ్‌స్టేషన్, ఆలూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ తెలిపారు. 33/11కేవి జామ్, చించోలి(బి), ఫీడర్‌పై చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వివరాలు అడుగుతున్న ఎస్సై షేక్ జుబేర్

తానూరు: వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై షేక్ జుబేర్ సూచించారు. శుక్రవారం మండలంలోని హిప్నెల్లి వద్ద భైంసా–తానూరు రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వెంట ధ్రువపత్రాలను ఉంచుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

భూమిపూజ

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. మందకృష్ణ మాదిగ ఆశయాలను నెరవేర్చడానికి ఈనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి సాగర్, జిల్లా అధ్యక్షుడు శనిగారపు రవి పిలుపునిచ్చారు. నరేందర్, ముత్యం, ప్రతాప్, పోశెట్టి, చంటి ఉన్నారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు

తానూరు: మండలకేంద్రంలోని బాపురావ్ లింగోబా ఇంటి ఆవరణలో ఉన్న బ్రహ్మ కమలం మొక్కకు గురువారం రాత్రి మూడు పుష్పాలు విరబూశాయి. సంవత్సరానికోసారి వికసించే ఈ పుష్పాలను తిలికించేందుకు కాలనీవాసులు తరలివచ్చారు. అనంతరం బ్రహ్మ కమలం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మ కమలం విరబూయడం అదృష్టంగా భావిస్తున్నామని ఇంటి యజమాని బాపురావ్ తెలిపారు.



పాఠశాలల్లో గోరింటాకు సంబురాలు



మామడ: పొన్కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



లోకేశ్వరం : కన్కపూర్‌లో..

లక్ష్మణచాంద: ఆషాఢమాసం నేపథ్యంలో శుక్రవారం మండలంలోని వడ్యాల్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గోరింటాకు సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థినులు గోరింటాకు పెట్టుకున్నారు. గోరింటాకుతో చర్మ సమస్యలు, శరీరంలోని వేడి తగ్గుతుందని పేర్కొన్నారు.

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గోరింటాకు వేడుక నిర్వహించారు. ఉపాధ్యాయులు గోరింటాకు విశిష్టత విద్యార్థులకు వివరించారు.

మామడ: మండలంలోని పొన్కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు, ఉపాధ్యాయినులు గోరింటాకు పెట్టుకున్నారు. హెచ్‌ఎం అరవింద్‌కుమార్ మాట్లాడుతూ గోరింటాకుతో సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయ్యులు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ ప్రాథమిక పాఠశాలలో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు గోరింటాకు తయారు చేసి విద్యార్థులకు పెట్టారు. హెచ్‌ఎం మెండె వెంకటరమణ, ఉపాధ్యాయులు రేష్మ, రజిత, అంగన్‌వాడీ టీచర్ ప్రభ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు

కుంటాల: మండలంలోని కల్లూరులో శుక్రవారం మొహర్రం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తిశ్రద్ధలతో ప్రజలు డప్పు, వాయిద్యాలతో పీరీల ఊరేగింపు నిర్వహించారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో శుక్రవారం మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. పీరీలను అలంకరించి వీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు పీరీలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



కల్లూరులో పీరీలను ఊరేగిస్తున్న ప్రజలు

నిల్వనీటిని పారబోయాలి

లోకేశ్వరం: వ్యాధుల బారిన పడకుండా ఇళ్ల పరిసరాల్లో నిల్వనీటిని పారబోయాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వీధులను, మురుగుకాల్వలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీవో సోలమాన్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి నారాయణ్, అంగన్‌వాడీ టీచర్ నర్సవ్వ, పరమేశ్వరి, అన్నపూర్ణ ఉన్నారు.



నీటిని పారబోయిస్తున్న ఎంపీడీవో వెంకటరమేశ్

బోనాల పండుగ



బోనాలతో కళాకారులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో పోచమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సదరు బోనాల పండుగ నిర్వహించారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భక్తులు ఇంద్రనగర్ నుంచి బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. వేములవాడకు చెందిన బోనం హారతి శిష్యబృందం బోనాల ప్రదర్శన, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం యాట మొక్కులతోపాటు పలు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

నమోదు చేసుకోవాలి

నర్సాపూర్(జి): రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని ఏఈవోలు భాగ్యలక్ష్మి, రమ్య తెలిపారు. మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం నర్సాపూర్(జి), నందన్, చాక్‌పల్లి, నసీరాబాద్ శివారు పంట భూములున్న రైతుల ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేశారు. కొత్తగా నమోదు చేసుకోవాలనుకునే రైతులు పట్టాపాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌లు, ఆధార్‌తో అనుసంధానించిన మొబైల్ నంబర్ తీసుకురావాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

తానూరు: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎంపీడీవో నసీరొద్దీన్ సూచించారు. శుక్రవారం మండలంలోని జౌలా(కే) గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా పలువురి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు నాణ్యతతో పకడ్బందీగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.